క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు


బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. మహిషాసురుడిని జగన్మాత సంహరించిన సందర్భంగా జరుపుకునే పండుగ దసరా అని తెలిపారు. దుష్టశక్తులపై దైవశక్తులు విజయం సాధించిన సందర్భంగా జరుపుకునే పండుగ నుంచి ప్రజలంతా సుఖసంతోషాలుగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు



పొన్నూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పురపాలక సంఘ పరిధిలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. బాపట్ల రోడ్డుతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపార సముదాయాల వద్ద పొక్లయిన్‌తో పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు పనుల్ని పర్యవేక్షించారు. అనంతరం 25 వార్డులో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించారు. నిడుబ్రోలు రక్షిత మంచినీటి పథకంలో పేరుకున్న పిచ్చి మొక్కలను కార్మికులు తొలగించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన అవసరం



పెదకాకాని: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, వివక్షతపై అవగాహన పెంచడం చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్ తెలిపారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, అనుమర్లపూడి గ్రామాల్లో క్రాఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని సంపూర్ణ హక్కులు పొందాలని సూచించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, డయల్ పోలీసు 100, ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్లు 181, 112పై అవగహన కల్పించారు. బాలలకు ఇబ్బందులు ఎదురైతే ఆయా నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అబ్బాయిల మాదిరిగానే అమ్మాయిలను కూడా సమానంగా పెంచితే సమాజం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, వివక్షతపై అవగాహన పెరగాలని పేర్కొన్నారు. బాలికలకు అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ఝాన్సీరాణి, శ్రీలక్ష్మి, కోటేశ్వరి, రాజకుమారి, కిశోర బాలికలు, బాలల పంచాయతీ బాలలు పాల్గొన్నారు.

పెదనందిపాడు ఎస్‌ఐగా మధు పవన్



కాకుమాను:పెదనందిపాడు ఎస్‌ఐగా ఏ.మధు పవన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.గతంలో ఆయన పట్టాభిపురంలో పని చేశారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెదనందిపాడు వచ్చారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మధు పవన్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.గ్రామ ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.గతంలో ఇక్కడ పని చేసిన నరహరి పట్టాభిపురం ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు.

టీ దుకాణంలో చోరీ

కాకుమాను: పెదనందిపాడు ప్రధాన కూడలిలో ఉన్న ఓ టీ దుకాణంలో గురువారం అర్ధరాత్రి ఆగంతకులు చొరబడి నగదు చోరీ చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గ్రామ ప్రధాన కూడలి లావు వారి చెరువుగా ఉన్న షేక్ సుభాని(గౌస్)టీ దుకాణం తాళాలు పగలకొట్టి నగదు అపహరించినట్లు పేర్కొన్నారు. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మారుతీనగర్‌లోని శ్రీ కంచికామకోటి పీఠ శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం గో పూజ, బాల పూజ, సువాసిని పూజలు, అమ్మవారికి సహస్రనామార్చనలతో పాటు చండీ హోమం నిర్వహించారు. ప్రదోషకాల సహస్రనామార్చన, అమ్మ వారికి నీరాజనం, మహా మంత్రపుష్పం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

'తారు' మార్

- నాసిరకంగా ప్రత్తిపాడు– పల్లపాడు తారు రోడ్డు నిర్మాణం
- ఏడాది కాకుండానే నెర్రెలు
- న్యూ టెక్నాలజీ వినియోగించినప్పటికీ ఫలితం నిల్


నిమ్మగడ్డవారిపాలెం - కొత్తమల్లాయపాలెం మధ్య నిర్మించిన తారు రోడ్డు , ఇన్‌సెట్‌లో నెర్రెలిస్తున్న తారు రోడ్డు

ప్రత్తిపాడు: గుత్తేదారులకు ఇంజినీరింగ్ అధికారుల అండదండలుంటే.. క్వాలిటీ కంట్రోల్ సైతం కళ్లకు గంతలు కట్టుకుంటే.. ఇక ఆ పనుల నాణ్యత ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకు నిదర్శనమే నెర్రలిచ్చి కనిపిస్తున్న ఈ తారురోడ్డు. ప్రత్తిపాడు నుంచి పల్లపాడు వరకు కోట్ల రూపాయలు వెచ్చించి ఈ తారు రోడ్డును నిర్మించారు. నిర్మాణం పూర్తయి పట్టుమని పన్నెండు నెలలు కూడా నిండకుండానే నెర్రలిస్తూ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తోంది. ఫలితంగా కోట్ల రూపాయలు 'తారు' పాలయ్యాయన్న విమర్శలు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

రూ. 6.1 కోట్లతో నిర్మాణం

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నిధులతో ప్రత్తిపాడు నుంచి నిమ్మగడ్డవారి పాలెం, కొత్తమల్లాయపాలెం మీదుగా వట్టిచెరుకూరు మండలం పల్లపాడు వరకు రోడ్డును నిర్మించారు. రూ. 6.1 కోట్లతో (ఐదు సంవత్సరాల నిర్వహణ వ్యయం రూ. 36.06 లక్షలుతో కలిపి)తో 7.428 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. పనుల్లో భాగంగా 6.565 కిలోమీటర్ల మేర తారురోడ్డును, 0.683 కిలోమీటర్ల పొడవునా సిమెంటు రోడ్డుతో పాటు, మార్గంమధ్యలో 12 కల్వర్టులను నిర్మించారు. నిర్మాణం సమయంలోనే కల్వర్టుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అక్కడక్కడా నెర్రలిచ్చాయి.

చిన్నబోయిన న్యూ టెక్నాలజీ

రోడ్డు నిర్మాణ పనుల్ని న్యూ టెక్నాలజీతో చేపట్టినట్లు అప్పట్లో ఇంజినీరింగ్ అధికారులు ప్రకటించారు. తొలుత మట్టిపని, బరం పోర్షన్, షోల్డర్స్ పనులను పూర్తి చేశారు. ఓవెన్ జియో టెక్స్‌టైల్ పట్టాను పరిచి దారిపై స్టోన్ డస్ట్‌ను పోసి లేయర్ వేశారు. తర్వాత గ్రాన్యులర్ సబ్‌బేస్, మెటల్ లేయర్, బిటుమినస్ లేయర్‌లను వేసి రోడ్డును నిర్మించారు. ఓవెన్ జియో టెక్స్‌టైల్ పట్టాను వినియోగించడం వలన రోడ్డు త్వరితగతిన కుంగిపోదని, సుమారు నలభై టన్నుల బరువును కూడా ఆపగలిగే సామర్థ్యం ఉంటుందని గొప్పగా చెప్పుకొచ్చారు. కానీ సీన్ కట్ చేస్తే నాణ్యతా లోపంతో ఏడాది తిరగకుండానే ఇదిగో ఇలా అక్కడక్కడా రోడ్డు నెర్రలిస్తోంది. మరి కొన్ని చోట్ల అతుకులు వేశారు. అంతేకాకుండా ఇంకొన్ని రోడ్డు చివర్ల ఛిద్రమై కనిపిస్తోంది. దీంతో ప్రజలు రోడ్డు నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సైడుల్లో ఛిద్రమవుతున్న తారురోడ్డు

నెర్రెలిచ్చిన చోట సరిచేయిస్తాం

నిర్మించిన మర్నాడే లోడు బండ్లు వెళ్లడంతో రోడ్డు అక్కడక్కడా నెర్రలిచ్చింది. . కాంట్రాక్టర్‌కు ఐదేళ్ల మెయింటెనెన్స్ బాధ్యత ఉంటుంది. నెర్రలొచ్చిన చోట సరి చేయిస్తాను.

–వెంకటరత్నం
(ఏఈ, పీఆర్ ప్రాజెక్టు వర్క్స్)

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నూనెల విక్రయాలు


ప్రత్తిపాడులో నూనెను విక్రయిస్తున్న సీఎస్ డీటీ పద్మజ


కాకుమానులో పంపిణీ చేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

ప్రత్తిపాడు: ప్రభుత్వం నిర్దేశించిన ధరకే వ్యాపారులు నూనెల విక్రయాలు చేయాలని సీఎస్ డీటీ పద్మజ తెలిపారు. నూనెల ధరలు పెరగడంతో ఎంపిక చేసిన దుకాణాల వద్ద అధికారులు ప్రత్యేకంగా విక్రయ కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ ఎదురున్న బంధం కిరాణా షాపులో వినియోగదారులకు ప్రభుత్వం సూచించిన ధరల ప్రకారం సీఎస్ డీటీ పద్మజ, వీఆర్వోలు రఫీ, ప్రసన్నలు స్థానిక నేతలతో కలసి విక్రయించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ మంత్రి వంటనూనెల వ్యాపారస్తులతో చర్చలు జరిపి వినియోగదారుల సౌకర్యార్థం ధరలు నిర్ణయించారని తెలిపారు. పామాయిల్ లీటరు ప్యాకెట్ (850 గ్రాములు) రూ. 110కి, సన్ ఫ్లవర్ ఆయిల్ లీటరు (910 గ్రాములు) రూ.124కు విక్రయించాలని తెలిపారు. ఒక్కో రేషన్ కార్డుదారునికి మూడు కేజీలు పామాయిల్, ఒక కేజీ సన్‌ఫ్లవర్ ఆయిల్ నిర్దేశిత ధరలకు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకుమానులో..

మండలంలోని గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అతి తక్కువ ధరకే వంట నూనెలను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. కాకుమానులోని రేషన్ దుకాణంలో శుక్రవారం పలువురు కార్డుదారులకు వంట నూనెలను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్యులు నిత్యావసర వస్తువులకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ అతి తక్కువ ధరలో పామాయిల్,సన్ ఫ్లవర్ ఆయిల్‌ను అందజేస్తోందని తెలిపారు. కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ మూడు ప్యాకెట్స్ పామాయిల్, ఒక ప్యాకెట్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నల్లమోతు పూర్ణయ్య, మామిళ్లపల్లి రాంగోపాల్, కొల్లా వీరయ్య చౌదరి, నల్లమోతు శంకరరావు, అగస్టీన్ పాల్గొన్నారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

పెదకాకాని : వరుస దొంగతనాలతో పెదకాకాని మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్ళను పసిగట్టి చోరీలకు పాల్పడుతున్నారు. పెదకాకాని బొడ్డురాయి బజారులో నన్నపనేని సాంబశివరావు కుటుంబం నివసిస్తోంది. ఈనెల 6న కుటుంబసమేతంగా హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి తాళాలు తీసి ఉండటంతో స్థానికులు సమీపంలో నివసిస్తున్న సాంబశివరావు సోదరుడు కృష్ణారావుకు సమాచారం అందించారు. చోరీ జరిగినట్లు గుర్తించిన ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి పెదకాకాని సీఐ టి. వీరాస్వామి సిబ్బంది చేరుకుని దర్యాప్తు చేపట్టారు. క్యూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. రెండు అంతస్తుల భవనంలో ఇంటి తాళాలు, బీరువా తాళాలు గడ్డపాలుగుతో పగులగొట్టినట్లు గుర్తించారు. ఇంటిలో రూ.15 లక్షల విలువ కలిగిన సుమారు 250 గ్రాములు బంగారం, రూ. 30 వేల నగదు చోరీకి జరిగినట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి. నారాయణస్వామి తెలిపారు.

జయ జయహే మహిషాసురమర్దిని !


ప్రత్తిపాడు దండేశ్వరాలయంలో మహిషాసురమర్దినిగా పార్వతీదేవి


ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి దేవాలయంలో మహిషాసురమర్దిని అవతారంలో రాజ్యలక్ష్మీదేవి


అద్దంకమ్మ తల్లి దేవాలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు


కాకుమాను అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు


చేబ్రోలు మండలం మంచాలలో మహిషాసురమర్దినిగా ఆదిలక్ష్మి కామేశ్వరి

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజైన శుక్రవారం ఆదిపరాశక్తి స్వరూపమైన అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అరుణారుణశోభతో ప్రకాశిస్తూ దేదీప్యమానంగా వెలిగారు. అఖండ హారతులు, వేదమంత్రాల మధ్య జగజ్జనని సర్వశుభోభితై భాసిల్లింది.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాలలో సర్వమంగళకారిణియైన లోకమాతకు అర్చనలు, ప్రత్యేక పూజలు, నైవేద్యాలతో విశేషంగా పూజలు నిర్వహించారు.

– ప్రత్తిపాడు, కాకుమాను, చేబ్రోలు

వరద బాధితులకు వీవీఐటీ విద్యార్థుల విరాళం



పెదకాకాని: వరద బాధితుల సహాయార్థం నంబూరు వివా వీవీఐటీ విద్యార్థులు సేకరించిన రూ. 10 లక్షల విరాళాన్ని ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం అందజేసినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం లాటరీకి 'ఫుల్లు'గా పోటీ

- ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషను పరిధిలోని 13 దుకాణాలకు 350 దరఖాస్తులు
- పొన్నూరులో ఏడు దుకాణాలకు 122 దరఖాస్తులు


ప్రత్తిపాడులో మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకుంటున్న ఆశావహులు


పొన్నూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న సీఐ రమేష్

ప్రత్తిపాడు: మద్యం వ్యాపారానికి పోటీ పెరిగింది. లాటరీ ప్రక్రియలో షాపులు దక్కించుకునేందుకు ఆశావహులు ఫుల్లుగా దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు దాఖలుకు నాన్‌రిఫండబుల్ ఫండ్ రూ. 2 లక్షలు నిర్దేశించినా మాత్రం వెనక్కు తగ్గలేదు. ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషను పరిధిలో మొత్తం పద మూడు షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా, శుక్రవారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి 350 అందాయి. సగటున ఒక్కో దుకాణానికి పాతికకు పైగా వచ్చాయి. జనం తాగకుండానే దరఖాస్తుల రూపంలో అబ్కారీ శాఖకు రూ. 7 కోట్ల ఆదాయం సమకూరింది. ఆయా దుకాణాల వారీగా నమోదైన దరఖాస్తుల వివరాలను ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్ర బాబు తెలిపారు. ప్రత్తిపాడులో 84వ నంబరు షాపునకు 37, 85వ నంబరు 36, 86వ నంబరుకు 36, 87వ నంబరుకు 32, వట్టిచెరుకూరు మండలంలో 88వ నంబరు షాపునకు 25, 89వ నంబరుకు 22, 90వ నంబరుకు 28, చేబ్రోలు మండలంలో 91వ నంబరు షాపునకు 22, 92వ నంబరుకు 21, 93వ నంబరుకు 23, 94వ నంబరుకు 23, 95వ నంబరుకు 23, 96వ నంబరుకు 22 దరఖాస్తులు నమోదయ్యాయని సీఐ, ఎస్‌ఐలు తెలిపారు.

పొన్నూరులో..

దసరా ధమాకా కూటమి నేతలకే వరించినట్లుంది. ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీ వారికే అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పొన్నూరు ఎక్సైజ్ పరిధిలో పొన్నూరు, కాకుమాను,పెదనందిపాడు మండలాలు ఉన్నాయి. పెదనందిపాడు మండలంలో మూడు దుకాణాలకు అధికంగా 88, కాకుమాను మండలంలో రెండు దుకాణాలకు 48 దరఖాస్తులు వచ్చాయి. పొన్నూరు పట్టణంలో నాలుగు దుకాణాలకు 83 టెండర్లు రాగా, మండలంలో మాత్రం మూడు దుకాణాలకు అతి తక్కువగా 39 దరఖాస్తులు వచ్చాయి. ఈ ధోరణి చూస్తే టీడీపీ కనుసన్నల్లోనే టెండర్ ప్రక్రియ కొనసాగినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎప్పుడెప్పుడా అంటూ నిరీక్షించిన వ్యాపారులు తీరా టెండర్లు వేసేందుకు అంతగా ఆసక్తి చూపించకపోవడం పొన్నూరులో చర్చనీయాంశంగా మారింది. పాలసీ అమల్లోకి వచ్చాక వ్యాపారుల్లో వచ్చిన అనేక సందేహాలు టెండర్లకు దూరం చేసినట్లు కనిపిస్తోంది. అధికార పార్టీకి చెందిన వారే దాఖలు చేయాలని ఆదేశాలు వచ్చినట్లు, తీరా లాటరీలో దుకాణాలు దక్కించుకున్నాక ఆ తర్వాత కలిగే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని చాలా మంది వెనుకడుగు వేసినట్లు సమాచారం. పొన్నూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతానికి సంబంధించి ఏడు దుకాణాలకు టెండర్లు నిర్వహించగా శుక్రవారం మొత్తం 122 టెండర్లు దాఖలైనట్లు ఎక్సైజ్ సీఐ రమేష్ తెలిపారు.